క్లుప్తంగా

తోటచర్ల ప్రైవేటు పాఠశాలకు నోటీసులు జారీ



పెనుగంచిప్రోలు: మండలంలోని తోటచర్ల గ్రామంలో అనధికారికంగా నిర్వహిస్తున్న సాహితీ కాన్వెంట్‌కు బుధవారం క్రిమినల్ కేసుతో కూడిన నోటీస్ జారీ చేయటం జరిగిందని ఎంఈఓ రవీంద్ర అన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ఈ పాఠశాలకు గత ఏడాది నోటీసులు ఇచ్చారన్నారు. అయినా ఈ ఏడాది కూడా పాఠశాల నిర్వహిస్తున్నారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు గుర్తింపు లేని పాఠశాలలల్లో తమ పిల్లలను చదివించకూడదన్నారు. ఈ పాఠశాల కారణంగా స్థానిక యూపీ పాఠశాలలో 7 పోస్టులు కోల్పోవటం జరిగిందన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి



వత్సవాయి: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంఈఓ కె.నాగరాజు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనబడి నాడు-నేడు పనులు వేగవంతం చేయాలని సూచించారు. జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ పూర్తయినందున ఆన్‌లైన్‌లో వివరాలు పొందుపరచాలని చెప్పారు. బడి ఈడు పిల్లలు అందరూ బడిలోనే ఉండాలన్నారు. యూనిఫాం విద్యార్థులు అందరూ ధరించి పాఠశాలకు వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు పాల్గొన్నారు.

గ్రామాలకు రెండు బృందాల ఏర్పాటు

పెనుగంచిప్రోలు: జగనన్న సురక్ష పథకంలో భాగంగా ప్రజలకు అవసరమైన పత్రాలను ఉచితంగా అందించేందుకు మండల స్థాయి అధికారులను రెండు బృందాలుగా ఏర్పాటు చేశామని ఎంపీడీఓ ఎస్‌వీ ప్రసాద్ బుధవారం తెలిపారు. మొదటి బృందంలో తహసీల్దార్, ఈఓపీఆర్‌డీ, తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఉండగా, రెండవ బృందంలో ఎంపీడీఓ, డెప్యూటీ తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయ ఏఓ ఉంటారన్నారు. మొదటి బృందం జులై 4న పెనుగంచిప్రోలు-1, 6న పెనుగంచిప్రోలు-2, 11న పెనుగంచిప్రోలు-3, 13న సుబ్బాయిగూడెం, 15న శనగపాడు, 18న వెంకటాపురం, 20న నవాబుపేట, 22న కొణకంచి, రెండవ బృందం జులై 4న అనిగండ్లపాడు-1, 6న అనిగండ్లపాడు-2, 11న గుమ్మడిదూర్రు, 13న లింగగూడెం, 15న ముచ్చింతాల, 18న శివాపురం, 20న ముండ్లపాడు సచివాలయాల్లో పర్యటిస్తారన్నారు.

ఆసుపత్రి పరిసరాలు శుభ్రంగా ఉండాలి



పెనుగంచిప్రోలు: ఆసుపత్రి పరిసరాలు శుభ్రంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుహాసిని అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పరిసరాలు, గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆవరణలో ఉన్న రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితులతో, కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో అన్నీ సక్రమంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి పి ఇందిర, సిబ్బంది పాల్గొన్నారు.

తొలకరి పలకరింపు



నందిగామ: ఎట్టకేలకు వరుణుడి కటాక్షం కలిగింది. తొలకరి జల్లులు పలకరించాయి. నందిగామ ప్రాంతంలో బుధవారం ఒక మోస్తరు భారీ వర్షం కురిసింది. గత కొద్ది రోజులుగా ఎండలు అధికంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో రుతుపవనాల ప్రభావంతో ఒక్కసారిగా వాతావరణం మారిపోయి వర్షం కురిసింది. ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతో ప్రజలు సేదతీరారు. ఇదిలా ఉండగా ఇప్పటికే ఖరీఫ్ సాగు కోసం పంట పొలాలను సిద్ధంగా ఉంచిన రైతులు తొలకరి జల్లులు పలకరించడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

యోగా సాధనతో దీర్ఘకాలిక వ్యాధులు దూరం



పేటలోని మార్కెట్ యార్డులో యోగా చేస్తున్న విద్యార్థులు



అల్లూరులో యోగాసనాలు సాధన చేస్తున్న విద్యార్థులు

జగ్గయ్యపేట అర్బన్: అంతర్జాతీయ యోగా దినోత్సవం పట్టణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు విద్యా సంస్థలలో సామూహిక యోగాసనాల కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో యోగ సాధకుల సంఘం, హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ యోగా గురువులు వి.సాయికుమార్, శ్యామ్ పాల్గొని యోగా ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ నేటి యాంత్రిక సమాజంలో మనిషి అనేక మానసిక ఒత్తిళ్లకు గురవుతూ చిన్న వయస్సులోనే పలు అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మానసిక ఉల్లాసం, ఏకాగ్రత యోగాతోనే సాధ్యం అవుతాయన్నారు. యోగా ద్వారా శ్వాసను అదుపులో ఉంచుకోవడం ద్వారా మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పలు యోగ భంగిమలు వేయించారు. హిందూ చైతన్య వేదిక, యోగ సాధకుల సంఘం ప్రతినిధులు డి.రవీందర్, పి.వెంగళరావు, ముత్యాల సైదేశ్వరరావు, రాధాకృష్ణ, పాండురంగారావు, పూర్ణచంద్రరావు, న్యాయవాది సత్యశ్రీనివాసరావుల ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. అలాగే స్థానిక మున్సిపల్ ఐకేపీ కార్యాలయంలో డ్వాక్రా మహిళలు యోగా దినోత్సవం నిర్వహించారు. సీవో నిర్మల పలువురు డ్వాక్రా మహిళలు, ఆర్పీలకు యోగాసనాలను నేర్పించారు. బీజేపీ ఆధ్వర్యంలో యోగాదినోత్సవం నిర్వహించారు. నీలిశెట్టి వారి కల్యాణమండపంలో ప్రముఖ యోగ గురువులు ధనుంజయవర్మ యోగాసనాలను వేయించారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మన్నె శ్రీనివాసరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు పచ్చిపాల నాగేశ్వరరావు, వత్సవాయి మండల అధ్యక్షుడు కాకాని వెంకటేశ్వరరావు, పేట మండల అధ్యక్షుడు చేపూరి వెంకటాచారి, నాయకులు అన్నెపాగ శ్రీకాంత్, గోలి రాఘవ, వేద సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా స్థానిక విజ్ఞాన్ హైస్కూల్లో విద్యార్థులతో యోగా కార్యక్రమం ఏర్పాటుచేశారు. గాయత్రీ మహిళా యోగా సమితి అధ్యక్షురాలు లీలావతి ముఖ్య అతిథిగా పాల్గొని యోగ విశిష్టతను వివరించారు. యోగా పురాతనమైన ఆరోగ్యసూత్రమని, చాలామంది రుషులు ఆరోగ్యంలో ప్రావీణ్యం పొంది శ్వాసను అదుపులో ఉంచుకోవడం ద్వారా 150 నుంచి 200 ఏళ్ల వారు జీవించిన సందర్భాలు ఉన్నాయన్నారు. అనంతరం విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. స్కూల్ డైరెక్టర్ తన్నీరు సుధారాణి మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం 10 నిమిషాలు విద్యార్థులకు యోగ చేయిస్తున్నట్లు తెలిపారు. ఎన్‌సీసీ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, ఎన్‌సీసీ బాలికల కేర్ టేకర్ కె.శివకన్య పాల్గొన్నారు.

యోగాతో మంచి ఆరోగ్యం

కంచికచర్ల : యోగాసనాలు సాధనతో ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలున్నాయని యోగా దీప్తి అర్లప్ప అన్నారు. మండలంలోని గండేపల్లి, పరిటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు యోగా నేర్పించారు. ఈ మేరకు దీప్తి మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు యోగా ప్రతిరోజు చేయటంతో గొప్ప ఉపశమనం లభిస్తుందన్నారు. శరీరం యాక్టివ్‌గా ఉండటమే కాకుండా ఫిట్‌గా తయారవుతుందన్నారు. మానసిక ఆరోగ్యానికి శరీర దృఢత్వానికి ఎంతో సహాయపడుతుందని తెలిపారు. జీర్ణక్రియ సమస్యలతో బాధపడేవారు తరచుగా పొట్ట సమస్యలతో ఇబ్బందులు పడేవారు తప్పనిసరిగా యోగాసనాలు చేయాలని సూచించారు. కండరాల బలహీనత, శరీర బలహీనత సమస్యలతో బాధపడేవారు ఆరోగ్య నిపుణులు సూచించిన ప్రత్యేక ఆసనాలు చేయాలన్నారు. కార్యక్రమంలో గండేపల్లి, పరిటాల సర్పంచులు బొక్కా రవికుమార్, యద్దనపూడి ఆనందజ్యోత్స్న, పంచాయతీ కార్యదర్శులు మీర్జావలి, సాంబశివరావు, జిల్లేపల్లి రత్నాకర్ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం

కొణకంచి(పెనుగంచిప్రోలు): యోగా క్రమం తప్పకుండా చేస్తే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని వైద్యాధికారి కె.వాణి తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం స్థానిక గ్రంథాలయ ఆవరణలో యోగాసానాలతో పాటు సాధనతో చేకూరే లాభాల గురించి వివరించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ యోగా వలన మనిషిలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. యోగా అభ్యసనం వలన అనేక రోగాలు రాకుండా ఉంటాయన్నారు. అనంతరం యోగా శిక్షకులను సత్కరించారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సర్పంచ్ గోనెల దేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండలంలోని ముండ్లపాడు అంగన్‌వాడీ కేంద్రంలో యోగా దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో యోగా ప్రాముఖ్యతను తెలియజేయటమే కాకుండా యోగాసనాలు చేయించారు. అలాగే గురు విశ్వస్ఫూర్తి వారి ఆశీస్సులతో స్థానిక స్ఫూర్తి కుటుంబసభ్యులు యోగా, ప్రాణాయామ, ధ్యాన సాధన విధానంపై అవగాహన కల్పించారు.

నందిగామ : యోగ మనిషిని ఆరోగ్యంగా ఉంచడంతో పాటు మానసిక ఉల్లాసాన్ని స్తుందని జిల్లా 16వ అదనపు కోర్టు న్యాయమూర్తి వి. శ్రీనివాసరావు తెలిపారు. నందిగామ పట్టణంలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. న్యాయ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని కళ్యాణ మండపంలో నిర్వహించిన యోగ డే వేడుకలకు న్యాయమూర్తి వి.శ్రీనివాస రావు, సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీరాజ్యం, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ పి.తిరుమలరావు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ షేక్ రియాజ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ యోగ ప్రతి మనిషికి అవసరమన్నారు. నిత్యం యోగా చేయడం వలన మనిషి ఆరోగ్యంగా ఉండడంతోపాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ముఖ్యంగా విద్యార్థులు యోగా చేయడం వల్ల జ్ఞాపక శక్తి పెరిగి వారు చదువులో రాణించడానికి యోగా సహకరిస్తుందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండి మల్లికార్జున రావు, న్యాయవాదులు బండారు సుధాకర్ రావు, మన్యం నారాయణరావు, షేక్ కరీముల్లా, పట్టణంలోని పలు కోర్టుల సిబ్బంది పాల్గొన్నారు. యోగా గురువు కిలారు ప్రసాద్ దంపతులను యోగ డే పురస్కరించుకుని ఆయన శిష్య బృందం సత్కరించారు. ఎన్నో సంవత్సరాలుగా పట్టణంలో ఉచితంగా యోగ నేర్పుతున్న ప్రసాద్ సేవలను కొనియాడారు.



పేటలోని విజ్ఞాన్ హైస్కూల్‌లో విద్యార్థులతో యోగాసనాలు చేయిస్తున్న గురువు లీలావతి



కొణకంచిలో విద్యార్థులకు బహుమతులు అందించిన సర్పంచ్ దేవి, వైద్యాధికారి వాణి

యోగాతో మానసిక దృఢత్వం

అల్లూరు(వీరులపాడు): యోగాతో శారీరక, మానసిక దృఢత్వం కలుగుతుందని ప్రధానోపాధ్యాయుడు వెంకట నారాయణ పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మండలంలోని అల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో బుధవారం యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా చేయటంతో మనసు, శరీరం నియంత్రణలో ఉంటుందని తెలిపారు. వయసుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ యోగాసనాలు చేయటం అలవర్చుకోవాలని సూచించారు. పీఈటీ రాజు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ నాగబాబు పాల్గొన్నారు.

కంచికచర్ల : యోగాతోనే మంచి ఆరోగ్యం పొందవచ్చని క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ అమర్లపూడి శేఖర్ అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమం హస్త కళల అభివృద్ధి కమీషనర్, కేంద్ర జౌళి మంత్రిత్వశాఖ వారి హ్యాండీక్రాఫ్ సర్వీస్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. ఈ మేరకు శేఖర్ మాట్లాడుతూ, మనస్సు, శరీరం మధ్య సామరస్యం తీసుకురావడానికి యోగా పనిచేస్తుందన్నారు. యోగా రక్తం గడ్డకుండా ప్రసరణను మెరుగుపర్చుతుందన్నారు. యోగా ఒత్తిడిని తగ్గిస్తుందని చెప్పారు. యోగా చేయటం వల్ల వెన్ను నొప్పి, నడుం నొప్పి రావన్నారు. కార్యక్రమంలో వీరులపాడు జెడ్పీటీసీ సభ్యులు కీర్తి సౌజన్య, సర్పంచ్ వేల్పుల సునీత, క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.అపర్ణలక్ష్మి, యోగా గురువు అర్లప్ప, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గరికపాడు(జగ్గయ్యపేట): ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా గ్రామంలోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు బూచవరం ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి అనిల్‌కుమార్ బుధవారం విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు యోగా అలవర్చుకోవాలన్నారు. యోగా చేయటం వల్ల శారీరకంగా, మానసిక దృఢత్వానికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వైద్య సేవలందిస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో మోహన్‌బాబు, సూపర్వైజర్ దస్తగిరి, ఎంఎల్‌హెచ్‌పి సురేంద్ర, 104 సిబ్బంది, పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు



యోగా గురువు కిలారు ప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న శిష్య బృందం



యోగా సాధనలో పాల్గొన్న సభ్యులు



గండేపల్లి జెడ్పీ స్కూల్లో ఆసనాలు వేయిస్తున్న యోగా గురువు దీప్తి

ఎంఈవోకు ఎస్టీయూ నేతల శుభాకాంక్షలు



జగ్గయ్యపేట అర్బన్: కంచికచర్ల నుంచి బదిలీపై జగ్గయ్యపేట మండల ఎంఈవోగా వచ్చిన ఎల్.చిట్టిబాబుకు ఎస్టీయూ నేతలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బుధవారం ఎస్టీయూ నేతలు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్టీయూ పేట అధ్యక్షుడు టీవీఎల్.నరసింహారావు జిల్లా నాయకులు బియ్యాల రామారావు, ఎం.శ్రీహరి మాట్లాడారు. ఎంఈవో చిట్టిబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయులంతా వృత్తి పట్ల అంకిత భావంతో పనిచేయాలని కోరారు. ఎస్టీయూ పేట అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరసింహారావు, కె.రామాంజనేయులు, జిల్లా ఆర్థిక కార్యదర్శి ఎం.శ్రీహరి, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి బియ్యాల రామారావు, జిల్లా నాయకులు సీహెచ్.శ్రీనివాసరావు, సీహెచ్.వెంకటేశ్వర్లు, ఎల్.ఎండీ నాయక్, బి.సైదా తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు ఆషాఢ సారె



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ కనకదుర్గ లలిత పారాయణ బృందం ఆధ్వర్యంలో శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు ఆషాఢ సారెను బుధవారం సాయంత్రం అందజేశారు. కొత్తగుళ్ల సమీపంలోని శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆర్యవైశ్య కల్యాణ మందిరం నుంచి కేరళ డప్పు వాయిద్యల, సన్నాయి మేళాల నడుమ మహిళలు అమ్మవారికి సారె సమర్పించేందుకు తరలివెళ్లారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుతో పాటు కన్యకాపరమేశ్వరి కమిటీ సభ్యులు, శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం కమిటీ సభ్యులు పాల్గొన్నారు. శ్రీ కనకదుర్గ లలితా పారాయణం బృందం సేవలను ఎమ్మెల్యే కొనియాడారు. సంస్థ అధ్యక్షుడు గ్రంధి రాము మాట్లాడుతూ నాలుగేళ్లుగా దుర్గమ్మకు సారె సమర్పిస్తున్నామరు. కార్యక్రమంలో విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు, దుర్గగుడి ట్రస్ట్ సభ్యులు బుద్దా రాంబాబు, కట్టా సత్తయ్య, కేసరి నాగమణి, ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి పోలేపల్లి సుబ్బు, శ్రీ కన్యకాపరమేశ్వరి సత్రం అధ్యక్ష, కార్యదర్శులు బచ్చు వెంకటలక్ష్మి వరప్రసాద్, బయన రాజేష్ పాల్గొన్నారు.

కౌలు రైతులకు అవగాహన

నందిగామ: మండలంలోని కేతవీరునిపాడు గ్రామంలో బుధవారం కౌల రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సహాయకుడు షేక్ మస్తాన్ ఆధ్వర్యంలో కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు, ఈ క్రాప్ నమోదు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు

కంచికచర్ల : కార్పొరేట్ స్కూళ్లు సైతం ఈర్ష్య పడేలా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎక్కువ మార్కులు సాధించటం అభినందనీయమని సర్పంచ్ బొక్కా రవికుమార్ అన్నారు. మండలంలోని గండేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జగనన్న ఆణి ముత్యాలు కార్యక్రమం జరిగింది. ఈ మేరకు సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను మరింత గొప్పగా మార్చాలనేదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. ఇప్పటికే నాడు-నేడు పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, డిజిటల్ క్లాస్ రూములు, స్వచ్ఛమైన తాగునీరు సరఫరా, పరిశుభ్రమైన టాయిలెట్స్, ఆడుకునేందుకు ఆట పరికరాలు అన్నీ సమకూర్చారని చెప్పారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించారు. ఎంపీటీసీ సభ్యులు పిల్లి భాగ్యలక్ష్మి, ఉపసర్పంచ్ బి.సుబ్బారావు, స్కూల్ కాంప్లెక్ చైర్మన్ డి.శ్రీనివాసరావు, హెచ్‌ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ రవికుమార్, నాయకులు

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

జగ్గయ్యపేట అర్బన్: జగనన్న సురక్ష పథకం విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ నాగమల్లేశ్వరరావు తెలిపారు. మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్ హాల్లో పట్టణంలోని 280 మంది వలంటీర్లు, సచివాలయాల అడ్మిన్లు, నోడల్ అధికారులకు బుధవారం నిర్వహించిన శిక్షణలో కమిషనర్ మాట్లాడారు. ప్రజల వద్దకే పాలనలో భాగంగా ప్రజల వద్దకు వెళ్లి వారి అవసరాలను గుర్తించి పరిష్కరించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారన్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, గృహసారథులు ప్రతి ఇంటికి వెళ్లి వారి అవసరాలను గుర్తించాలని తెలిపారు. సిటిజన్స్‌కు సంబంధించిన ఆధార్‌కు మొబైల్ నెంబర్ లింకింగ్, కొత్త రేషన్ కార్డులు, రేషన్ కార్డుల విభజన, జనన ధ్రువీకరణ, ఆదాయ, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్, రెవెన్యూ, ఆధార్ సేవలు, మ్యారేజ్ సర్టిఫికెట్లు మొదలగు సేవలకు సంబంధించి అనుసరించాల్సిన విధి విధానాలను, అర్జీదారు నుంచి తీసుకోవాల్సిన పత్రాల గురించి వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, నోడల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు, పాల్గొన్న వలంటీర్లు, సిబ్బంది

గురు సంప్రదాయాన్ని కాపాడుకోవాలి

విజయవాడకల్చరల్: గురు సంప్రదాయాన్ని కాపాడుకోవాలని వయోలిన్ విద్వాంసుడు అన్నవరపు రామస్వామి సూచించారు. శ్రీవారి శిష్యప్రశిష్య బృందం ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు నిర్వహించే సంగీత సద్గురువుల ఆరాధనా మహోత్సవాలను శివరామకృష్ణ క్షేత్రంలో బుధవారం ఆయన ప్రారంభించారు. రామస్వామి మాట్లాడుతూ విజయవాడ నగరం సకల కళాకేంద్రమని ముఖ్యంగా సంగీత రంగానికి చెందిన ఎందరో మహనీయులు ఇక్కడ సంగీత సరస్వతికి సంగీత సేవ చేసుకున్నారన్నారు. కార్యక్రమ పర్యవేక్షకుడు మోదుమూడి సుధాకర్ మాట్లాడుతూ సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రి సంగీతోత్సవాలను వారి శిష్యులు పారుపల్లి రామకృష్ణయ్య పంతులు నిర్వహించే వారన్నారు. వారి ఆరాధనా ఉత్సవాలను వారి శిష్యప్రశిష్యులు నిర్వహిస్తున్నారని ఇదే సంప్రదాయం నాటి నుంచి కొనసాగుతోందన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులకు సత్కారం



పెనుగంచిప్రోలు: స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్ నుంచి బదిలీ అయిన ఐదుగురు ఉపాధ్యాయులకు బుధవారం పాఠశాల ఆవరణలో సన్మానం చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం జలజ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎక్కడ విధులు నిర్వహించినా అంకిత భావంతో పనిచేయాలన్నారు. అలాగే బ్యాంకింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫైనాన్షియల్ లిటరసీ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన పాఠశాల విద్యార్థులు ఇంటూరి దినేష్, కొరదల ఇందులను సత్కరించారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ బత్తుల వెంకటనర్సు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం బైపాస్ రహదారి పక్కనగల స్టేడియం ప్రతిపాదిత స్థలంలో ఏర్పాటు చేసిన టీ-10 టెన్నిస్ బాల్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు బుధవారం ప్రారంభించారు. తొలుత క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం కొద్దిసేపు క్రికెట్ ఆడి సందడి చేసి క్రీడాకారులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో స్టేడియం నిర్మాణ పనులను ప్రారంభిస్తామన్నారు. ఇప్పటికే ఈ గ్రౌండ్‌లో స్థానికుల కోసం వాకింగ్ ట్రాక్ సిద్ధం చేశామని చెప్పారు. దీంతో పశ్చిమ నియోజకవర్గ ప్రజల చిరకాల కోరిక సాకారం కానుందన్నారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు బాపతి కోటిరెడ్డి, గుడివాడ నరేంద్ర రాఘవ, యరడ్ల ఆంజనేయరెడ్డి, ఎండీ ఇర్ఫాన్, పడిగపాటి చైతన్యరెడ్డి, మైలవరపు దుర్గారావు, రాయన నరేంద్ర పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వెలంపల్లి, చిత్రంలో భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు

లలితాంబికా పీఠంలో ప్రత్యేక పూజలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వారాహి నవరాత్రుల్లో భాగంగా పాలప్రాజెక్టు క్వార్టర్స్ సమీపంలోని శ్రీ లలితాంబికా పీఠంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో మూడో రోజైన బుధవారం వారాహి అమ్మవారిని పోత్రిరిణి వారాహిగా అలంకరించారు. అమ్మవారికి పీఠాధీశ్వరి శివలీల మాతాశ్రీ పూజలు నిర్వహించగా, ఆలయ ప్రాంగణంలో భక్తులచే సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఆషాఢ శుద్ధ పాడ్యమి నుంచి ప్రారంభమ్యే వారాహి దేవి నవరాత్రుల్లో వారాహి అమ్మవారికి ఆరాధించిన వారికి నక్షత్ర దోషం, నాగ దోషం, గో దోషం, బ్రహ్మహత్యామహా పాతక దోషాలు తొలగిపోవడమే కాకుండా ఆయురారోగ్యాలు, సిరి సంపదలు కలుగుతాయని శివలీల మాతాశ్రీ భక్తులను అనుగ్రహ భాషణం చేశారు.

గాయపడిన వ్యక్తి మృతి

కంచికచర్ల: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ పెంకె సత్య వెంకట సుబ్రహ్మణ్యం కథనం మేరకు... పరిటాల శివారు నక్కలంపేటకు చెందిన పోపూరు రామకృష్ణ (41) ఈనెల 9వ తేదీన పరిటాల శివారు దొనబండ పెట్రోల్ బంక్‌లో బైక్‌లో పెట్రోలు పోయించుకుని తిరిగి ఇంటికి వస్తుండగా గ్రామ సమీపంలోని అండర్‌పాస్ రోడ్డుకు రాగానే ఎదురుగా వస్తున్న స్కూటీ బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో రామకృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

నందిగామ: మనస్తాపంతో పురుగుల మందు తాగిన ఓ యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ పండు దొర తెలిపిన సమాచారం ప్రకారం... పట్టణ శివారు అశోక్ నగర్ ప్రాంతానికి చెందిన బుర్రి పవన్ (18) తాను ఇష్టపడ్డ యువతికి వేరే పెళ్లి చేస్తారేమోనన్న భయంతో ఈ నెల 16వ తేదీన పురుగుల మందు తాగాడు. అప్పటి నుంచి విజయవాడలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. యువకుడి మృతి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.